క్లుప్తంగా

ఘనంగా పైడితల్లి అమ్మవారి పండగ



పైడితల్లి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక : మండలంలోని అరబుపాలెంలో మంగళవారం పైడితల్లి అమ్మవారి పండుగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో నేల వేషాలు ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనం సందర్భంగా ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగు చర్యలు తీసుకున్నారు.

ఉత్సాహంగా విజ్ఞాన శిబిరం

కోటవురట్ల : స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. గ్రంథాలయాధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులతో పుస్తకం పఠనం చేయించి, నీతి కథలు చెప్పడం, పద్యాలు, దేశ భక్తి గీతాలాపనపై సాధన చేయించారు. గ్రంథాలయ సందర్శనను అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

వలంటీర్లకు సత్కారం



మామిడివాడలో వలంటీర్లతో ప్రజాప్రతినిధులు, నాయకులు

రాంబిల్లి: మామిడివాడలో మంగళవారం వలంటీర్లను ఘనంగా సత్కరించారు. సర్పంచ్ ఎం. అప్పలనర్స, వైఎస్సార్‌సీపీ నాయకులు నానేపల్లి సాయి, నెట్టెం సత్యన్నారాయణ, కె. సన్యాసిరావు, రాఘవేంద్ర, రాము తదితరులు వలంటీర్లను సన్మానించి వారి సేవలను కొనియాడారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మునగపాక : ప్రతి ఒక్కరూ ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పి.రవికుమార్ కోరారు. ఉమ్మలాడ, ఒంపోలు సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ ప్రత్యేక సేవలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్‌లోని మార్పులు, చేర్పులకు అవకాశం ఉందన్నారు. ఈ కేంద్రం ద్వారా అందించే సేవలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ఈశ్వరరావు, సర్పంచ్ సూరిశెట్టి గంగయమ్మ(ఎస్ఆర్) పాల్గొన్నారు.

వీసంకు ఘన సన్మానం

నక్కపల్లి : ఆంధ్రప్రదేశ్ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా నియమితులైన కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణను మండలంలో వేంపాడు పీఏసీఎస్ పరిధిలో పలువురు నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావు చేతుల మీదుగా రామకృష్ణను దుశ్శాలువతో సత్కరించారు. వైఎస్సార్‌సిపిలో క్రియాశీలకంగా పనిచేస్తూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్న వీసంకు జగనన్న సముచిత స్థానం కల్పించారని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలతో జంగిల్ క్లియరెన్స్



కె.వెంకటాపురంలో జంగిల్ క్లియరెన్స్ చేస్తున్న ఉపాధి కూలీలు

కోటవురట్ల : కె.వెంకటాపురంలోని జెడ్పీ హైస్కూల్ పరిసరాల్లో భారీగా పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ చర్యలు చేపట్టారు. సమస్యను అధికారులకు తెలియజేయడంతో ఉపాధి హామీ పథకం ద్వారా మంగళవారం జంగిల్ క్లియరెన్స్ చేయించారు. పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు డ్రైనేజీలో పూడిక తీయించారు.

వేసవి శిక్షణలో నీతి కథలు

రాంబిల్లి : దిమిలి శాఖా గ్రంథాలయంలో మంగళవారం వేసవి శిక్షణ కొనసాగింది. నీతి కథలు, చదవడం, రాయడంపై లైబ్రేరియన్ ఎస్.శకుంతల అవగాహన కల్పించారు. నీతి కథలో నీతిని విద్యార్థులు గ్రహించి మంచి క్రమశిక్షణతో మెలిగి బాగా చదువుకోవాలని ఆమె సూచించారు.

అధిక వేగం...లేదు కళ్లెం!

- అధికలోడు, మితిమీరిన వేగంతో భారీ వాహనాల రాకపోకలు
- పూడిమడక రోడ్డులో ప్రయాణికుల బెంబేలు
- ప్రమాదాలు జరిగే అవకాశం



పూడిమడక రోడ్డులో దూసుకొస్తున్న లారీ



పూడిమడక రోడ్డులో మునగపాక వద్ద రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలు

మునగపాక : మితిమీరిన వేగం.పరిమితికి మించిన లోడుతో భారీ వాహనాల రాకపోకలు సాగిస్తుండడంతో పూడిమడక రోడ్డుపై ప్రయాణం అంటేనే జనం బెంబేలెత్తిపోతున్నారు. అచ్యుతాపురం నుంచి అనకాపల్లి బైపాస్ రోడ్డు వరకు ఉన్న ప్రధాన రహదారిలో చోడపల్లి, కొండకర్ల, హరిపాలెం, తిమ్మరాజుపేట, మునగపాక, నాగులాపల్లి తదితర గ్రామాలున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు ఆటోలు, ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. అనకాపల్లి బైపాస్ రోడ్డు నుంచి అచ్యుతాపురం వరకు వెళ్లే రహదారిపై పరిమితికి మించి లోడుతో భారీ వాహనాలు ప్రయాణం సాగిస్తున్నాయి. ఈ రోడ్డుపై 15 టన్నులకు మించి వాహనాలు వెళ్లడానికి వీలు లేదు. అయినా తమకు పట్టనట్టు భారీ వాహనదారులు 60 నుంచి 80 టన్నులతో ప్రయాణం సాగిస్తున్నారు. దీంతో ఈ రోడ్డు శిథిలావస్థకు గురవుతుంది. భారీ వాహనాల రాకపోకల కారణంగా ఒకవైపు రహదారి దెబ్బతినడమే కాకుండా మరోవైపు అధిక వేగం కారణంగా ప్రమాదాలపై భయం నెలకొంటున్నది. ద్విచక్ర వాహనదారులు, ఆటోలపై రాకపోకలు సాగించేవారు ఆందోళనకు గురవుతున్నారు. భయం గుప్పిట్లో రాకపోకలు సాగిస్తున్నారు.

నియంత్రణ తూతూ మంత్రం...

ఒకవైపు పూడిమడక రోడ్డులో ప్రయాణం సాగించే క్రమంలో పలువురు గాయాల బారిన పడడం, అలాగే కొంతమంది మృత్యువాతకు గురైన సందర్భాలు లేకపోలేదు. నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారిన పూడిమడక రోడ్డుపై భారీ వాహనాలను నియంత్రించాల్సిన అధికారులు కూడా తూతూ మంత్రంగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకొంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ మార్గంలో అధికలోడుతో వాహనాలు రాకూడదన్న నిబంధనలున్నా అమలు కావడం లేదు.పలు ప్రయివేటు పాఠశాలలు, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, ప్రయివేటు ఐటీఐలలో చదువుకునేందుకు నిత్యం విద్యార్థులు ఈ రోడ్డుమార్గం గుండా రాకపోకలు సాగిస్తుంటారు. మితిమీరిన వేగంతో వచ్చే వాహనాలను తప్పించుకుంటూ వారంతా భయంతో రాకపోకలు సాగించాల్సి వస్తోంది.

భారీ వాహనాలను నియంత్రించాలి



పూడిమడక రోడ్డులో ప్రయాణం అంటేనే భయంగా ఉంటుంది. భారీ వాహనాలు అధిక లోడుకు తోడు మితిమీరిన వేగంతో ఈ రోడ్డుపై దూసుకు వస్తున్నాయి. అధికారులు తగు చర్యలు తీసుకొని వాహనాల వేగాన్ని నియంత్రించాలి.

– రాజాన బుజ్జిబాబు, ద్విచక్ర వాహనదారు, మునగపాక

చర్యలు తీసుకుంటాం



పూడిమడక రోడ్డులో అధికలోడుతో వాహనాలు వెళితే చర్యలు తప్పవు. ఇప్పటికే లారీ యజమానులకు హెచ్చరికలు జారీ చేశాం. అతి వేగంతో వాహనాలు నడిపినా లేదా అధికలోడుతో వాహనాలు వచ్చినా ఉపేక్షించేది లేదు. భారీ వాహన డ్రైవర్లకు అవగాహన కల్పించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

– మహమ్మద్ ఆలీ షరీఫ్, ఎస్ఐ

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు జగనన్న ఘనతే



కొత్తపట్నంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న సుకుమారవర్మ

రాంబిల్లి : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జననేత జగనన్నకే దక్కుతుందని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. కొత్తపట్నం గ్రామంలో మంగళవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ద్వారా ఎంత మేర లబ్ధి చేకూరింది వివరించారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చి పారదర్శకంగా అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గ్రామంలో తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న గ్రామస్తులు ఒరుపుల నూకరాజు, గరికిన నూకరత్నంకు డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జి.శిరీష శ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, మండల సచివాలయ కన్వీనర్ కొవిరి రామకృష్ణ, పార్టీ నాయకులు డీఎస్ఎన్ రాజు(బుజ్జి), సర్పంచ్ పార్వతి, ఎంపీడీవో కొండలరావు, తహసీల్దార్ భాగ్యవతి పాల్గొన్నారు.

గొర్లె ధర్మవరంలో మినీ వాటర్‌డ్యాం



మినీ వాటర్ డ్యాంను ప్రారంభిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని గొర్లె ధర్మవరంలో ఏషియన్ పెయింట్స్ సీఎస్ఆర్ నిధులు రూ.16.40 లక్షలతో అంబుజా సిమెంట్స్ ఆధ్వర్యంలో నిర్మించిన వాటర్ డ్యాంను మంగళవారం ఎమ్మెల్యే రమణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతలో భాగంగా అచ్యుతాపురం పరిసరాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయమన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ కోన బుజ్జి, వడిసెల శ్రీనివాసరావు, విమలనాయుడు, పిన్నంరాజు వాసు, లాలం శ్రీను పాల్గొన్నారు.

ఆట, పాటలతో గణితంపై అవగాహన

అచ్యుతాపురం(అనకాపల్లి) : గణితంలో మెలకువలు నేర్చుకుంటే ఉన్నత విద్య అవకాశాలతో పాటు, గణితంలో పట్టు సాధించవచ్చని ఉపాధ్యాయులు రాజా నరేంద్ర అన్నారు. అచ్యుతాపురం మండలంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా మంగళవారం పిల్లలకు ఆట, పాటలతో గణితంలో మెలకువలపై అవగాహన కల్పించారు. నిరంతర సాధన ద్వారా గణితంపై పట్టు సాధించవచ్చని, తద్వారా విద్య, ఉద్యోగాల్లో ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. లైబ్రేరియన్ కోటేశ్వరరావు, 20 మంది చిన్నారులు పాల్గొన్నారు.

పరిశ్రమల సహకారం అభినందనీయం



లాలంకోడూరులో వాటర్ ట్యాంకు ప్రారంభించిన ఎమ్మెల్యే ఎమ్మెల్యే కన్నబాబు

రాంబిల్లి : అభివృద్ధి పనులకు పరిశ్రమల యాజమాన్యాలు ముందుకు రావాలని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు(కన్నబాబు) కోరారు. లాలంకోడూరులో రూ.14 లక్షలు ఏషియన్ పేయింట్స్ నిధులతో నిర్మించిన వాటర్ ట్యాంకును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఏషియన్ పేయింట్స్ ఆర్థిక సాయంతో కొత్తపేటలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా ఏషియన్ పేయింట్స్ పలు అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమన్నారు. ఇదేవిధంగా మిగిలిన కంపెనీల యాజమాన్యాలు సీఎస్ఆర్ కింద అభివృద్ధి పనులు చేసేందుకు ముందుకురావాలన్నారు.

29న కలెక్టరేట్ వద్ద ఉపాధి హామీ కూలీల ధర్నా

అచ్యుతాపురం(అనకాపల్లి): ఈ నెల 29న జిల్లా కలెక్టరేట్‌ల వద్ద సీఐటీయూ, ఐద్వా, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.రాము పిలుపునిచ్చారు. ఉపాధి హామీ కూలీలపై కలెక్టరేట్‌ల వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. మంగళవారం అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల, హరిపాలెం, పెదపాడు గ్రామాల్లో గ్రామీణ ఉపాధి హామీ కూలీలతో సమావేశమై ఆయన ఛలో కలెక్టరేట్ కార్యక్రమం గురించి వివరించారు.

రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు



రైతులకు చెక్కులను అందిస్తున్న వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు

పాయకరావుపేట : రైతులు సహకార సంఘాల్ని సద్వినియోగం చేసుకోవాలని ఉత్తరాంధ్ర జిల్లాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. మండలంలో గల శ్రీరాంపురం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) పరిధిలో గల రైతులకు పట్టణంలో గల డీసీసీబీ బ్రాంచిలో మంగళవారం రుణాల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా చిక్కాల రామారావు మాట్లాడుతూ సహకార సంఘాల్లో రైతులకు పంట రుణాలు, వ్యవసాయేతర రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలు, దీర్ఘకాలిక రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయ పెట్టుబడులకు, ఇతర అవసరాలకు రైతులు సహకార సంఘాల ద్వారా రుణాలు పొందవచ్చునన్నారు. అనంతరం పలువురు రైతులకు రూ.40 లక్షలు రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మేనేజర్ లీల, ఫీల్డ్ ఆఫీసర్ జోగినాయుడు, సీఈవో టి.వి.రామరాజు, జి.ఎస్.వెంకటరావు, కొంతం రాము పాల్గొన్నారు.

55 మందికి ఉచిత కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు గణపతిరావు

పాయకరావుపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న డా.వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా పాయకరావుపేట లింగాల కాలనీలో కంటి శిబిరం జరిగింది. వైద్యాధికారిణి డా.పద్మప్రియ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ఆప్తాలిమిక్ అధికారి మజ్జి గణపతిరావు సుమారు 55 మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 8 మందికి శస్త్ర చికిత్సలు, 45 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారిని వచ్చే నెల 13వ తేదీన విశాఖపట్నం ప్రాంతీయ నేత్ర వైద్యశాలకు తరలిస్తామని వైద్యాధికారి తెలియజేశారు. ఆరోగ్య విస్తరణాధికారి గణేశ్వరిరావు, హెల్త్ సూపర్‌వైజర్ ఎం.నాగేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ రమ్య, ఏఎన్ఎం విజయకుమారి, ఆశా కార్యకర్తలు సేవలందించారు.

అప్పల నరసింహం సేవలు మరువలేనివి



మాజీ ఎంపీ అప్పలనరసింహం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మునగపాక : నాగులాపల్లి అభివృద్ధికి దివంగత అప్పలనరసింహం అందించిన సేవలు మరువలేనివని బీసీ సాధికారిక కమిటీ సభ్యుడు మళ్ల సురేంద్ర అన్నారు. నాగులాపల్లిలో మంగళవారం మాజీ ఎంపీ పెతకంశెట్టి అప్పలనరసింహం వర్ధంతి సందర్భంగా పలువురు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ అనకాపల్లి ఎంపీగా పనిచేసిన కాలంలో అప్పలనరసింహం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుపడ్డారన్నారు. వుడా చైర్మన్‌గా పనిచేసి ఈ ప్రాంత అభివృద్ధికి తోడ్పడ్డారని, పలు పదవులకు వన్నె తెచ్చారని అన్నారు. ఆయన ఆశయ సాధనకు పాటుపడాలన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు



అధికారుల దాడుల్లో పట్టుబడిన నాటుబళ్లు

ఎస్.రాయవరం : వరాహనదిలో అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ శ్యామ్ కుమార్ హెచ్చరించారు. తరచూ నదిలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది కలిసికట్టుగా మంగళవారం దాడులు నిర్వహించి ఇసుక రవాణా చేస్తున్న 9 నాటుబళ్లను పట్టుకున్నట్టు చెప్పారు. ఈ సిబ్బంది తరచూ గ్రామాల్లో ఇసుక తీస్తున్నట్టు సమాచారం ఉందని, ఇసుక రవాణాతో నదీ గర్భం గోతులు పడుతోందన్నారు. ఇకపై అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టుబడిన నాటుబళ్లను తిమ్మాపురం సచివాలయం ప్రాంగణంలో భద్రపరచామన్నారు.

వలంటీర్లతో ప్రజలకు సకాలంలో సేవలు



వలంటీర్లను సత్కరిస్తున్న మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు లక్ష్మి

మునగపాక : వలంటీర్లు అంకితభావంతో పనిచేయడం వల్ల ప్రజలకు సకాలంలో సేవలందుతున్నాయని మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు బోజా లక్ష్మి అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. మండలంలోని చెర్లోపాలెం, మెలిపాక సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు మంగళవారం ఘన సత్కారం నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో వలంటీర్ల పాత్ర కీలకమైందన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు,వలంటీర్ల సమన్వయం చేసుకోవాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అప్పికొండ సత్యవతి, జాజుల వెంకటరావు, ఉపసర్పంచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో శరవేగంగా మౌలిక వసతుల కల్పన



ప్రభుత్వ పథకాల బ్రోచర్లను లబ్ధిదారులకు అందిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట : రాష్ట్రంలో గ్రామాలు అభివృద్ధికి అధిక ప్రాధాన్యతను రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇస్తున్నారని, గ్రామాల్లో మౌలిక వసతులు కల్పన శరవేగంగా చేస్తున్నారని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండలంలో గల మాసాహేబుపేట గ్రామంలో రెండవ రోజు కూడా గడపగడపకు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లు నిర్మాణం, జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా, కుళాయిల ఏర్పాటు, నాడు – నేడు పథకం ద్వారా పాఠశాలల అభివృద్ధి, అందరికీ వైద్యం అందించడం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు, వెల్‌నెస్ సెంటర్లు నిర్మాణం చేపడుతున్నారన్నారు. రైతులకు అందుబాటులో రైతు భరోసా, ప్రజా సమస్యలు పరిష్కారం కోసం గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను వివరించారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పింఛన్లు, అమ్మ ఒడి, రైతు భరోసా కేంద్రాలు, విద్యాదీవెన, వసతి దీవెన వంటి తదితర పథకాలు అమలు తీరుపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలతో పాటు, ఇళ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయింపుతో పాటు ఇళ్ల నిర్మాణాలకు కూడా ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తుందన్నారు. అనంతరం సంక్షేమ పథకాల బ్రోచర్లను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సాయిబాబా, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, సర్పంచ్ నీలవేణి, ఎంపీటీసీ నరేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులు

- వలంటీర్లను సన్మానించుకోవడం మన బాధ్యత
- ఎమ్మెల్యే బాబూరావు



వేంపాడులో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి : ప్రభుత్వానికి , ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తూ విశేషమైన సేవలందిస్తున్న వలంటీర్లను సన్మానించుకోవడం మనందరి బాధ్యత అని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మంగళవారం వేంపాడు పీఏసీఎస్ పరిధిలో ఉన్న గ్రామాల్లో పనిచేసే వలంటీర్లను ఘనంగా సన్మానించారు. వేంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు సక్రమంగా అందేలా వలంటీర్లు కృషి చేస్తున్నారన్నారు, తనకు కేటాయించిన 50 కుటుంబాల్లో ఉన్న అవసరాలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారన్నారు. పార్టీలకతీతంగా వలంటీర్లు చేస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ప్రభుత్వం వారికి ఇచ్చేది కేవలం పారితోషకం మాత్రమేనన్నారు. వలంటీర్ల వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలిచేలా వీరి పనితీరు ఉందన్నారు. వికలాంగులకు తావు లేకుండా పింఛన్లను బట్వాడా చేయడం చేయడం, వివిధ వ్యక్తిగత కారణాలతో దూర ప్రాంతాల్లో ఉన్నవారికి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి వద్దకు కూడా వెళ్లి స్వయంగా పింఛన్లు అందజేయడం ద్వారా ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. వలంటీర్లతో సమన్వయం చేసుకుంటూ గ్రామాల్లో ఉండే గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మరింత సమర్థంగా అమలయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు కాసులమ్మ, వైస్ ఎంపీపీలు ఈశ్వరరావు,నానాజీ, సర్పంచ్ నూకరత్నం, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు మణిరాజు, మండల పార్టీ అధ్యక్షుడు పాపారావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్‌లు సూరాకాసుల రామలక్ష్మి గోవిందు, తాతారావు, ఎంపీటీసీలు సత్తిబాబు, తంగెళ్ల కృష్ణ, బీసీ సెల్‌నాయకులు, సర్పంచ్‌లు చిన పేర్రాజు, సురేష్ వర్మ, కృష్ణ పాల్గొన్నారు.

నాలుగేళ్లలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాం

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సంబరాలు



ఎమ్మెల్యేకు కేక్ తినిపిస్తున్న వీసం

నక్కపల్లి : అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో ఇచ్చిన హామీల్లో 95 శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదేనని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా వేంపాడులో ఆంధ్రప్రదేశ్ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే గొల్లబాబూరావు కేక్ కట్ చేశారు. కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాబూరావు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగని మెజార్టీ సీట్లు సాధించి రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైందన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సుపరిపాలన అందించిందన్నారు. నాలుగేళ్లలో దాదాపు రూ.2.50 లక్షల కోట్ల విలువైన సంక్షేమ పథకాలను ప్రజలకు అందించిందన్నారు. ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు అయినంపూడి మణిరాజు, మండల పార్టీ అధ్యక్షుడు పాపారావు, వైస్ ఎంపీపీలు వెలగా ఈశ్వరరావు, వీసం నానాజీ, సర్పంచ్‌లు చినపేర్రాజు, సురేష్ వర్మ, నూకరత్నం, కృష్ణ, సూరాకాసుల గోవిందు, తాతారావు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని బీసీ కాలనీ వాసుల వినతి



ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్‌కు వినతి అందజేస్తున్న బీసీ కాలనీ వాసులు

మునగపాక : సామాజిక అవసరాల కోసం కేటాయించిన సామాజిక స్థలంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మించకుండా చూడాలని కోరుతూ మంగళవారం మునగపాక బీసీ కాలనీ వాసులు ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్‌కు వినతి అందజేశారు. కాలనీకి చెందిన డాక్టర్ బద్దెం సూర్యనారాయణ మాట్లాడుతూ మునగపాకలో 1987లో రైతుల నుంచి నిరుపేదలకు పట్టాలిచ్చేందుకు భూములు సేకరించామన్నారు. ఆ స్థలంలో 245కు పైగా పట్టాలిచ్చారన్నారు. అందులో సామాజిక అవసరాల నిమిత్తం 25 సెంట్లకు పైగా స్థలం కేటాయించారన్నారు. నేడు అదే స్థలంలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేసేందుకు అధికారులు యత్నిస్తున్నారన్నారు. తమకు కేటాయించిన స్థలంలో అంగన్‌వాడీ నిర్మాణం జరగకుండా చూడాలని కోరారు. రికార్డులు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ఇన్‌ఛార్జి తహసీల్దార్ హామీ ఇచ్చారు.